ఇసుక ర్యాంపును అడ్డుకున్న గ్రామస్థులు







అధ్వానంగా నిజాంసాగర్ కెనాల్

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

15-7-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## లింబాద్రిగుట్ట అభివృద్ధికి రూ.4 కోట్లు



**అక్షరటుడే, భీమ్ గల్ :** భీమ్ గల్ శివారులోని లింబాద్రిగుట్ట అభివృద్ధి కోసం పర్యాటక శాఖ నుంచి రూ.నాలుగు కోట్లు మంజూరైనట్లు ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తెలిపారు. వచ్చిన నిధులతో లింబాద్రిగుట్ట మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టీజీఎండీసీ ఛైర్మన్ అనిల్ ఈరవత్రి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆగని దారి దోపిడీలు

▸ జాతీయ రహదారిపై రెచ్చిపోతున్న దొంగలు ▸ గతంలో ఏడుగురు అరెస్ట్ ▸ టేక్రియాల్ ఘటనతో మళ్లీ ఆందోళన



**జిల్లాలో దారి దోపిడీలు ఆగడం లేదు. పోలీసులు ఎన్ని చర్యలు చేపడుతున్నా.. దొంగలు రెచ్చిపోతూనే ఉన్నారు. జాతీయ రహదారిపై రాత్రిపూట వెళ్తున్న వాహనాలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్నారు. గతంలో పలువురు వాహనదారులను ఆపి దోపిడీ చేసిన దొంగలు.. తాజాగా దాబా దగ్గర నిలిపిన ట్రక్కులో చోరీ చేశారు. పార్థీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేయడంతో దోపిడీల భయం పోయిందనుకునేలోపే టేక్రియాల్ వద్ద మొబైల్ ఫోన్లు చోరీ చేయడంతో ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై మార్చి, ఏప్రిల్ నెలలలో దారి దోపిడీ ముఠా రెచ్చిపోయింది. 15 రోజుల వ్యవధిలో రెండు చోట్ల దోపిడీలకు పాల్పడింది. కొందరు రాత్రి పూట వాహనాలను ఆపి, ఆయుధాలతో బెదిరించి వారి దగ్గర సొత్తు దోచుకున్నారు. పంక్చర్ షాపు యజమాని ఇచ్చిన క్లూతో పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్ ఈ దాడులకు తెగబడుతున్నట్టుగా గుర్తించారు. 11 మంది ముఠాగా ఏర్పడి దోపిడీలు చేస్తున్నట్లు గుర్తించి.. అందులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో నలుగురిపై పీడీ యాక్ట్ కూడా పెట్టారు. దాంతో మూడు నెలల పాటు జాతీయ రహదారులపై దోపిడీ ముఠా సభ్యుల కదలికలు కనిపించలేదు.

### కొత్త ముఠానా..

కొంత కాలంగా దోపిడీ ఘటనలు చోటు చేసుకోవడంతో భయం పోయిందని వాహనదారులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా టేక్రియాల్ జాతీయ రహదారిపై ఓ దాబా వద్ద ఆగి ఉన్న మొబైల్ ట్రక్కులో నుంచి రూ.10 లక్షల విలువ చేసే మొబైల్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో మరోసారి దారి దోపిడీ ముఠా పోలీసులకు సవాల్ విసిరిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఈ దోపిడీకి పాల్పడింది పార్థీ గ్యాంగ్ సభ్యులా.. లేక కొత్త ముఠా జిల్లాలోకి ప్రవేశించిందా అని పోలీసులు విచారిస్తున్నారు. గతంలో జాతీయ రహదారి పక్కన ఆపిన వాహనాల్లో డీజిల్‌ను సైతం దొంగలు చోరీ చేశారు. వందల లీటర్ల డీజిల్ చోరీ చేసిన ఘటనలు గతంలో భిక్కనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూశాయి.



### పోలీసుల ప్రత్యేక నిఘా

గతంలో జరిగిన దోపిడీ ఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అప్రమత్తమయ్యారు. జాతీయ రహదారిపై నిరంతరం పెట్రోలింగ్ చేపడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టారు. దాంతో కొద్దిరోజులుగా రోడ్డు ప్రమాదాలు, చోరీలు తగ్గుముఖం పట్టాయి. తాజా ఘటనతో పోలీసు శాఖ మళ్లీ అప్రమత్తమైంది. మొబైల్స్ చోరీ నిందితులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

### విచారణ చేస్తున్నాం

టేక్రియాల్ జాతీయ రహదారిపై జరిగిన దోపిడీ కేసు విచారణ చేస్తున్నాం. గతంలో దొంగతనాలు చేసిన ముఠా పనేనా.. లేక ఇతర వ్యక్తులు ఎవరైనా ఈ చోరీకి పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. బైపాస్ రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం.

**– ఎస్సై రంజిత్, దేవునిపల్లి**

## రేపు జిల్లాకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈనెల 16న జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో హాజరుకానున్నారు. ముందుగా హైదరాబాద్ నుంచి డిచ్‌పల్లి 7వ పోలీస్ బెటాలియన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగే రెండవ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజన అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అక్కడ జిల్లా అధికారులు, కవులు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర అవార్డు గ్రహీతలతో ముచ్చటిస్తారు. అనంతరం జిల్లా టీబీ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

## పోలీసు నిబంధనలు పాటించాలి : సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ :** జిల్లాలో పోలీసు ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా విగ్రహాల ఏర్పాటు, అధిక శబ్దం చేసే డీజేలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు ముందుగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. మాల్స్, సినిమా టాకీస్‌లు, హోటళ్లు, ఎగ్జిబిషన్, వ్యాపార ప్రదేశాల్లో ప్రజా భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని, ఈ మేరకు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లోని ఎస్‌హెచ్‌వో, ఎస్సైలకు పూర్తి అధికారాలు ఇచ్చినట్లు సీపీ వెల్లడించారు.

## వసతి గృహం తనిఖీ




**అక్షరటుడే, భీమ్ గల్ :** పట్టణంలోని ఎస్సీ వసతి గృహాన్ని భీమ్ గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ మంగళవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. వసతి గృహంలో గదులు, మరుగుదొడ్లు, వంటశాల, వంట సామగ్రిని పరిశీలించారు. నాణ్యతతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు.

## నిజాంసాగర్ నీటి విడుదల



**అక్షరటుడే, నిజాంసాగర్:** వానాకాలం పంటల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్ నుంచి మంగళవారం సాయంత్రం 1,200 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువ ద్వారా విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈఈలు సాకేత్, శివప్రసాద్ తెలిపారు. నిజాంసాగర్ జలాశయం జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం సమీపంలోని ప్రధాన గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. పది రోజులపాటు నీటి విడుదల కొనసాగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులకు (17.80 టీఎంసీలు) గాను 1,391.46 అడుగులు (4.703 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు. ఆయకట్టు రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలలో హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు.

## సిద్ధులగుట్ట ఆలయానికి రూ.50లక్షలు..



**అక్షర టుడే, ఆర్మూర్ :** పట్టణంలోని సుప్రసిద్ధ నవనాథ సిద్ధులగుట్ట ఆలయానికి రూ.50లక్షల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి వినయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గతంలో సిద్ధులగుట్ట ఆలయాన్ని సందర్శించారని, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈమేరకు రూ.50లక్షల నిధులు మంజూరు చేసి హామీ నిలబెట్టుకున్నారన్నారు. ఇందుకు మంత్రి జూపల్లికి ఆలయ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

## అటవీ సంపదను కాపాడుకుందాం



**అక్షరటుడే, బాన్సువాడ:** అటవీ సంపదను కాపాడే బాధ్యత అందరిదని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రకృతిని నాశనం చేస్తే భావితరాలకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, ప్రిన్సిపాల్ గంగాధర్, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, వెంకన్న గుప్తా, కృష్ణారెడ్డి, ఎజాజ్, దావుద్ తదితరులు పాల్గొన్నారు.

## తెయూ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



**అక్షర టుడే, ఇందల్వాయి:** తెలంగాణ విశ్వ విద్యాలయంలో నిర్వహించే రెండో స్నాతకోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి యాదగిరి రావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యులు హాజరు కానున్న నేపథ్యంలో మంగళవారం వర్సిటీ ఆవరణలో పోలీసు అధికారులు డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు జరిపారు. ఏడో బెటాలియన్ ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్ల రిహార్సల్స్ చేశారు. కార్యక్రమంలో ఆయా కమిటీ సభ్యులు, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు పనితీరు మార్చుకోవాలి: సీతక్క

**అక్షరటుడే, కామారెడ్డి:** అధికారులపై ఎమ్మెల్యేలు ప్రతి విషయంలో ఫిర్యాదు చేస్తున్నారని, పనితీరు మార్చుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. అంతకుముందు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం సమీక్షలో మాట్లాడుతూ.. గ్రామాల్లో వాటర్ ట్యాంకులు 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క

### వన మహోత్సవాన్ని సక్సెస్ చేయాలి..

జిల్లావ్యాప్తంగా వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. తన నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా వాటర్ ట్యాంకులు శుభ్రం చేయట్లేదని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్‌లు లేక అధికారుల పర్యవేక్షణ లేక గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని వివరించారు. దీంతో మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో వాట్సాప్ గ్రూప్‌లు తయారుచేయాలని.. ఎమ్మెల్యేలను అందులో చేర్చాలని సూచించారు. జీపీ హెడ్ క్వార్టర్స్‌లో పంచాయతీ కార్యదర్శులు ఉండడం లేదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యదర్శులు స్థానికంగా ఉండి ఉదయాన్నే పంచాయతీ సిబ్బందిని పర్యవేక్షిస్తే ఏ సమస్య ఉండదని ఆయన పేర్కొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, వైద్యాధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేస్తేనే కొత్త ఇళ్ల మంజూరుకు అవకాశం ఉంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయని హౌసింగ్ అధికారి విజయ్‌పాల్ పేర్కొనగా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. విడతల వారీగా పూర్తయిన ఇళ్లకు పేమెంట్ చేయడం లేదని ఎమ్మెల్యే పోచారం తెలిపారు. తాను ప్రతిరోజు ఇళ్ల నిర్మాణాల వద్దకు వెళ్తానన్నారు. గ్రౌండ్ లెవల్‌లో అధికారులు పర్యటించడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై తాను మంత్రి పొంగులేటితో మట్లాడతానన్నారు.





## బోనాల సంబురం





**అక్షరటుడే, ఇందూరు:** టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగినులతో పాటు అధికారులు బోనమెత్తారు. బోనాలను ఊరేగింపు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలో ఆయా శాఖల మహిళా ఉద్యోగులు బోనాలతో తరలివచ్చారు. కాగా.. ఉత్సవాల్లో నానియాదవ్ మాతంగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమ్మవారి బోనంతో విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుమన్, శేఖర్, అసోసియేట్ ప్రసిడెంట్ పెద్దోళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కోనోకార్పస్ చెట్లను తొలగించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలని పట్టణవాసులు కోరారు. చెట్లను తొలగించాలని కోరుతూ మంగళవారం రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. శ్వాస సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలున్నందున వెంటనే తొలగించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ప్రతి వీధిలో ఈ మొక్కలు నాటారని.. ప్రస్తుతం అవి వృక్షాలుగా మారాయని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పతంజలి రఘువీర్, గాజుల రాజులు, ప్రీతం రెడ్డి ఉన్నారు.

## మార్చురీని స్కూల్‌కు దూరంగా నిర్మించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చూరి గదిని బాలికల ఆశ్రమ వసతి గృహానికి దూరంగా ఉండేలా నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం ఆస్పత్రి ఆర్ఎంవో సుజాతకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మార్చూరి గది కారణంగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావడమే కాకుండా భయాందోళనకు గురయ్యారని, కొత్తగా నిర్మిస్తున్న మార్చురీ గదిని వేరే చోట నిర్మించాలని సూచించారు. మార్చురీ గది మార్చకపోతే విద్యార్థులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, కౌన్సిల్ సభ్యులు ప్రసాద్, చిదుర సాయిలు, చిరంజీవి, మహేష్.శివశంకర్, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

## రైతులకు క్రాప్‌లోన్లు ఇవ్వట్లేదు



**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని కొత్తపల్లి సొసైటీ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. లింగాపూర్(గన్నారం) రైతులకు, క్రాప్‌లోన్స్ ఇవ్వటం లేదని పేర్కొంటూ మంగళవారం సొసైటీ ఎదుట ఆందోళన చేశారు. లింగాపూర్ గ్రామంలో రైతుల కోసం గోదాం నిర్మాణం చేయాలని ఎన్నిసార్లు తీర్మానం చేసినా గోదాం నిర్మాణానికి అడుగు ముందుకు పడట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై సునీల్ వచ్చి రైతులతో మాట్లాడి వారిని సముదాయించారు. కార్యక్రమంలో రైతులు, హన్మంత్, కొండారెడ్డి, శంకర్, శేఖర్, రవి, శ్యామ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి




**అక్షరటుడే, నిజాంసాగర్ :** ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయని, అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం పెద్ద కొడప్గల్‌లోని జెడ్పీ బాలికల పాఠశాలలో సురక్ష పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతంగా రాణించాలన్నారు. సైబర్ నేరాలు, ఇతర మోసాలు, చట్టాలు, తదితర అంశాలపై వివరించారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి లేదా పోలీసు కంట్రోల్ రూం 8712659360కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సురక్ష పోలీస్ కళాబృందం సభ్యులు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అధ్వానంగా నిజాంసాగర్ కెనాల్..!

- ఆక్రమణలతో కుచించుకుపోయిన కాలువ
- నిర్వహణ లేక అస్తవ్యస్తం

**పట్టణ పరిధిలోని పెర్కిట్ చెరువులోకి నీటిని తరలించే నిజాంసాగర్ కాలువ అధ్వానంగా మారింది. ఇష్టారీతి ఆక్రమణలతో చిన్నపాటి డ్రెయినేజీని తలపిస్తోంది. నిర్వహణ లోపం, అధికారుల పర్యవేక్షణ కొరవడి ఆనవాళ్లు కోల్పోయింది. దీంతో రైతుల పంటపొలాలకు నీరు అందట్లేదు. భారీ వర్షా ల సమయంలో కాలువ నుంచి వరదనీరు పారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.**



పెర్కిట్‌లోని చెరువును నింపేందుకు 1990 -95 ప్రాంతంలో నిజాంసాగర్ కాలువను నిర్మించారు. పట్టణంలోని దూదేకుల కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీల్లో అప్పట్లో వ్యవసాయ భూములు ఉండేవి. దీంతో ఈ భూములకు సాగు నీరు అందించేందుకుగాను విశాలమైన కాలువ నిర్మించారు. రైతులు సైతం ఏటా కెనాల్ నీటి ద్వారా పంటలు సమృద్ధిగా పండించేవారు. ఏటా కెనాల్‌ను శుభ్రపరుచుకునేవారు. క్రమేపీ చెరువు కింది ఆయకట్టు అంతా ఆనవాళ్లు కోల్పోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కెనాల్‌ను ఆక్రమించుకుని ప్లాట్లు చేయడంతో కాలువ కుచించుకుపోయింది. ప్రస్తుతం కెనాల్ చిన్నపాటి మురికి కాలువను తలపిస్తోందంటే అతిశయోక్తి కాదు.

### పట్టించుకునే వారేరి..

కాలువ కబ్జాకు గురవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో రైతులు ఏర్పాటు చేసుకున్న కాలువ నిజాంసాగర్ కెనాల్ పరిధిలోకి రాదని, నిజాంసాగర్ కెనాల్‌కు సంబంధించి మ్యాపులో కాలువ లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు చెరువు కింది ఆయకట్టు పూర్తిగా ప్లాట్లుగా మారిపోవడంతో రైతులు సైతం పట్టించుకోలేదు. ఫలితంగా కొందరు కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురవుతుండడంతో, భారీ వర్షాలు కురిసినప్పుడు వరద ధాటికి పరిసర కాలనీల్లోకి నీరు చేరుతోంది. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి కెనాల్‌ను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

### కెనాల్‌పై ఆక్రమణలు తొలగించాలి..




పెర్కిట్ చెరువుకు నీటిని అందించే నిజాంసాగర్ కెనాల్‌ను క్రమబద్ధీకరించాలి. కెనాల్ అక్రమ నాలాతో నీళ్లు వృథాగా పోతున్నాయి. కెనాల్ పరిధిలోని ఆక్రమణలను తొలగించి, కెనాల్‌కు పూర్వవైభవం తీసుకురావాలి. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి.

**– పూజ నరేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు**

## పోతంగల్‌లో ఘనంగా బోనాలు



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్‌లో మంగళవారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత పోతంగల్ హనుమాన్ మందిరం, ఆబాది హనుమాన్ మందిరం నుంచి కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, ఆటపాటలతోప్రధాన వీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ... ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో ఉండాలని సమృద్ధిగా ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## ఇసుక ర్యాంపును అడ్డుకున్న గ్రామస్థులు



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలం సుంకిని ఇసుక క్వారీని నిలిపివేయాలని గ్రామస్థులు, పట్టుబట్టారు. ఇసుక ఇస్తే గ్రౌండ్ వాటర్ తగ్గుతుందని, ఆవేదన వ్యక్తం చేశారు, గ్రామస్తులు రైతులు, ఇసుక తవ్వకాలకు వేస్తున్న ర్యాంప్‌ను నిలిపివేశారు. అక్కడికి చేరుకున్న తహశీల్దార్ గంగాధర్, అనుమతులు లేకుండా, తవ్వకాలు జరిపేందుకు, ప్రయత్నించిన, టిప్పర్లు, జెసీబీని, సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో, ఏఎంసీ ఛైర్మన్ హన్మంత్, సర్వేయర్, పోశెట్టి, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, సుంకిని మాజీ సర్పంచ్ మాధవరావు పటేల్, షాజి, హనుమంత్ రావు, రాంబాబు, నాగ్ నాథ్, సుంకిని, రైతులు, గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.

## ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో పుస్తకాల గది సీజ్




**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో పుస్తకాల గదిని ఎంఈవో సేవ్లా సీజ్ చేశారు. పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టులు విక్రయిస్తున్నారని ఏబీవీపీ కార్యకర్తలు మంగళవారం స్కూల్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో విద్యాసామగ్రి పేరుతో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా విక్రయిస్తున్న యూనిఫామ్, బుక్స్, బెల్టులు తదితర సామగ్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మారుస్తూ తల్లిదండ్రులకు ఇబ్బందులను గురి చేస్తున్నారని అన్నారు. ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎంఈవో సేవ్లా విద్యా సామగ్రి గదిని సీజ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ సునీల్, కంఠేశ్వర్ జోనల్ ఇన్‌ఛార్జి దుర్గాదాస్, శ్రీశాంత్, నవీన్, మున్నా, శివ, సందీప్, యశ్వంత్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి యాజమాన్యంపై కేసునమోదు చేయాలి




**అక్షరటుడే, ఇందూరు:** సిగాచి పరిశ్రమ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 45 మంది మృతి చెందారన్నారు. వీరితోపాటు పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బాధిత కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దాసు తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్ చేస్తే సమాచారమివ్వండి



**అక్షర టుడే, ఆర్మూర్:** ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా వెంటనే షీ టీం బృందానికి సమాచారమివ్వాలని షీటీం సబ్ డివిజన్ కానిస్టేబుళ్లు విగ్నేష్, సుమతి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మండలం మిర్దపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈవ్ టీజింగ్ బాధితులు నిర్భయంగా షీ టీం నంబర్ 87126 59795కు లేదా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా షీటీంకు ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవాలి



**అక్షర టుడే, నిజాంసాగర్:** ఆధార్ తరహా ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్య కేటాయించేందుకు ప్రభుత్వం రైతు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఏఈవో సాగర్ తెలిపారు. నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి రైతువేదికలో మంగళవారం రైతు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు రైతు గుర్తింపు నంబర్ తప్పనిసరి అన్నారు. నమోదు చేయించుకోనివారికి పథకాల ప్రయోజనం పొందలేరన్నారు. ప్రతి రైతు ప్రత్యేక నంబర్ కోసం నమోదు చేయించుకోవాలని సూచించారు. తమ ఆధార్, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, పట్టాపాస్‌బుక్‌తో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు గ్రీన్ బోర్డులు అందజేత



**అక్షర టుడే, నిజాంసాగర్:** రాష్ట్రవ్యాప్త పంపిణీలో భాగంగా మంగళవారం నిజాంసాగర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 65 గ్రీన్ బోర్డులు పంపిణీ అధికారులు పంపిణీ చేశారు. దీంతో ఎంఈవో తిరుపతిరెడ్డి ఈ మేరకు వివరాలు తెలిపారు. మండలంలోని 24 పాఠశాలలకు 65 బోర్డులు వచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకుగాను వీటిని పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అచ్చంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకట్రామిరెడ్డి, సీఆర్పీలు శ్రీధర్ కుమార్, నర్సింలు, ఎం వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



**అక్షరటుడే నిజాంసాగర్:** జాతీయ రహదారిపై సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన జాతీయ రహదారి-161పై మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం బాచేపల్లి నుంచి పిట్లం మండలం తిమ్మానగర్‌కు సిమెంటు లోడుతో వెళ్తున్న వాహనం నిజాంసాగర్ మండలం వెల్గనూర్ శివారులోని కొత్త మైసమ్మ సమీపంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. వాహనంలో ముగ్గురు ఉండగా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితులు బాచేపల్లికి చెందిన వారిగా గుర్తించారు.

## బస్తీ దవాఖానా కోసం స్థల పరిశీలన



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో బస్తీ దవాఖానా కోసం మంగళవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో స్థలపరిశీలన చేశారు. ముందుగా గంజి ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. అక్కడ స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అనంతరం బ్రాహ్మణగల్లీలోని గ్రామచావడిని తనిఖీ చేశారు. ఆ ప్రాంతం బస్తీ దవాఖానా ఏర్పాటుకు అనువుగా ఉందని భావిస్తూ.. ఏర్పాట్లకు ప్రతిపాదనాలు పంపాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కృష్ణజాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో స్రవంతి ఉన్నారు.

## మహా గర్జన విజయవంతం చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** హైదరాబాద్‌లో ఆగస్టు 13న నిర్వహించే దివ్యాంగ పింఛన్‌దారుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి సామెల్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎల్లారెడ్డిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18న జిల్లాకేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్ కంతి పద్మారావు, ప్రవీణ్ ఎల్లబాబు, యాదగిరి, లావణ్య పాల్గొన్నారు.